

క్యాండిల్ ర్యాలీలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మహిళలు

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- నల్గొండ జిల్లా ఘటనపై క్యాండిల్ ర్యాలీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని మహిళలు, విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఇటీవల నల్గొండ జిల్లాలో జరిగిన ఘటనపై బుధవారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ తీశారు. ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాకు చెందిన మల్లీశ్వరి కుల వివక్ష కారణంగానే ఆత్మహత్యకు పాల్పడిందని, ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన లైంగిక దాడుల ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులను ఎందుకు శిక్షించడం లేదని ప్రశ్నించారు. సర్కారు నిర్లక్ష్యం వల్ల గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ అయి అనేక మంది విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఆయన వెంట మహిళలు, కార్యకర్తలు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

కాగజ్‌నగర్ మండలం కడంబాకు చెందిన దాదాపు 20 మంది యువకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. నక్క మురళి ఆధ్వర్యంలో వారు బీఆర్ఎస్‌లోకి రాగా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పలు గ్రామాల్లో ఆర్ఎస్పీ పర్యటన

చింతలమానేపల్లి, ఏప్రిల్ 16 : మండలంలోని బాబాపూర్, జూజులగూడ, కోర్సిని, గంగాపూర్ గ్రామాల్లో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటించారు. ఆయాచోట్ల ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అటవీ శాఖ అధికారులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చేలల్లోకి వెళ్లనివ్వడం లేదని, రోడ్లు, బోర్లు వేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ సర్కారులో రంది లేకుంటా పంటలు సాగు చేసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్లనుంచి వ్యవసాయం చేసుకుంటున్నా రైతులను అడ్డుకోవడం ఏమిటని ఆర్ఎస్పీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి పలు అంశాలపై మాట్లాడారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోమాసి లహంచు, నాయకులు శివకుమార్, పోషన్న, శంకర్, జాన్సీ ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



జన్నారం మండలం పొనకల్‌లో ఎండిపోయిన వరి

# పంటలు చేతికొచ్చేనా..!?

**కడెం ప్రాజెక్టు నుంచి సాగు నీటి విడుదలకు బ్రేక్**

- శిథిలమై అధ్వానంగా మారిన కాలువలు
- ఎండుతున్న వరి, మక్క, జొన్న
- మరో రెండు తడులు అందించాలని రైతుల వేడుకోలు

జన్నారం, ఏప్రిల్ 16 : కడెం ప్రధాన కాలువతో పాటు 13,19, 22 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ద్వారా నీటి విడుదల నిలిపివేయగా, రైతాంగం ఆందోళన చెందుతున్నది. కోటి ఆశలతో సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోతుంటే గుండెలు బాదుకుంటున్నది.

జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 5 వేల ఎకరాల్లో వరి, 840 ఎకరాల్లో మక్క, 142 ఎకరాల్లో జొన్న సాగు చేశారు. మొన్నటి వరకు కడెం ప్రాజెక్టు నుంచి వారబందీ పద్ధతిలో ఏడు వారాల పాటు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నీటి విడుదలకు బ్రేక్ వేయడంతో చేతికొచ్చే దశలో ఉన్న పంటలన్నీ ఎండిపోతున్నాయి. మొర్రిగూడ, తపాలాపూర్, తిమ్మాపూర్, రేండ్లగూడ, పొనకల్, ధర్మారం గ్రామాల్లో ఇప్పటికే వందలాది ఎకరాల్లో వరితో పాటు మిగతా పంటలు కూడా ఎండిపోయాయి. ప్రధానంగా పొట్టదశలో ఉన్న వరి పైరుకు నీరందక తాలుగా మారి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కడెం ప్రాజెక్టు అధికారులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చొరవ తీసుకొని మరో రెండు తడులు అందించి ఆదుకునేలా కృషి చేయాలని వారు వేడుకుంటున్నారు.



సిమెంట్ లైనింగ్‌లేక అధ్వానంగా ఉన్న 13వ డిస్ట్రిబ్యూటరీ కాలువ

### శిథిలమై అధ్వానంగా మారిన కాలువలు

కడెం ప్రధాన కాలువతో పాటు 13,19, 22 డిస్ట్రిబ్యూటరీ కాలువలు శిథిలమై అధ్వానంగా మారాయి. తూములు కూడా దెబ్బతిన్నాయి. కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి చివరి వరకూ నీరందడం లేదు. కడెం ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసినప్పుడల్లా ఎక్కడికక్కడ నీరంతా వృథాగా పోతున్నది. చివరి ఆయకట్టు వరకూ నీరందడం లేదని రైతులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని వారు కోరుతున్నారు.



ఇందన్‌పెల్లి కడెం ప్రధాన కలువలో పేరుకుపోయిన చెత్త

### పై అధికారులదే నిర్ణయం

ఇప్పటికే యాసంగి పంటలకు ఏడు వారాల పాటు వారబందీ ద్వారా సాగు నీరందించాం. ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గింది. మరో రెండు తడులకు సాగునీరివ్వాలని రైతులు కోరుతున్నారు. పై అధికాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదు.

-శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ

### పంటలు ఎండిపోకుండా చూడాలి



కడం ప్రాజెక్ట్ ప్రధాన కాలువ కింద సాగు చేసిన పంటలు ఎండిపోకుండా చూడాలి. ప్రస్తుతం వరి పైరు చేతికొచ్చే దశలో ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలి. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముంది.

- కమ్మల విజయధర్మ, చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్

### చివరి ఆయకట్టుకూ నీరందించాలి



19, 22 డిస్ట్రిబ్యూటరీ కాలువల కింద సాగు చేసిన పంటలకు సాగు నీరందేలా చూడాలి. కొన్ని రోజులైతే వరి పంట కోతకు వస్తుంది. ఇప్పుడు సాగు నీరందించకుంటే నాలాంటి రైతులు తీవ్రంగా నష్టపోతారు. కడెం ప్రాజెక్టు అధికారులు కనికరించి సాగు నీరందించాలి.

- భూమన్న, తపాలాపూర్, రైతు



తిమ్మాపూర్‌లో ఎండిపోయిన వరి

# వడగండ్ల వాన.. నేలకొరిగిన వరి

జైపూర్, ఏప్రిల్ 16 : మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, వడగండ్ల వానకు వరి పంట నేలకొరిగింది. శెట్‌పల్లి శివారులో తనకున్న ఐదెకరాల్లో వేసిన వరి వడగండ్ల వానకు మొత్తం దెబ్బతిన్నదని రైతు అనవేని దుర్గయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

శెట్‌పల్లి శివారులో నేలకొరిగిన వరి



# ఎమ్మెల్సీ దాసోజుకు శుభాకాంక్షలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 16 : ఇటీవల బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రావణ్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సన్మానించారు.



దాసోజుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా**



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 16 : పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, విశ్రాంతి పోలీస్ ఉద్యోగుల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేని హాస్పిటల్-కరీంనగర్, కేర్ హాస్పిటల్-హైదరాబాద్, శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్-గోదావరిఖని, మాక్స్ విజన్-వరంగల్, మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్ సునీల్, సైక్రియా ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో వైద్య నిపుణులు పోలీస్ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలను నిర్వహించారు. సీపీ సైతం వైద్యపరీక్షలు నిర్వహించుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లున్నా ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

- చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్
- రజతోత్సవ సభ ప్రచారం

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రాజా రమేశ్ పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు బుధవారం రామకృష్ణాపూర్‌లో జోరుగా ప్రచారం నిర్వహించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్‌లోని 14, 15,17,18,20 వార్డుల్లో వాల్ పోస్టర్లు అంటించారు. వాల్ రైటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రామిడి కుమార్, బడికల సంపత్, అలుగుల సత్తయ్య, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, అనిల్‌రావు, రేవెల్లి ఓదెలు, పారుపెల్లి తిరుపతి, గడ్డం రాజు, అశనవేని సత్యనారాయణ, చంద్రమౌళి, లక్మారెడ్డి, రంగరాజు, పైతారి ఓదెలు, మేకల రమేశ్, యువ నాయకులు రామిడి లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, శివ, మణి, గోనె రాజేజెందర్ పాల్గొన్నారు.

### ఉద్యమ స్ఫూర్తిని చాటాలి

మందమర్రి, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలి వచ్చి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేశ్ పిలుపు నిచ్చారు. బుధవారం మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బీఆర్ఎస్ నాయకులతో కలసి రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం.. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ కృషితో చెన్నూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, బండారు సూరిబాబు, ఎండీ అబ్బాస్, బోరిగం వెంకటేశ్, మద్ది శంకర్, ఈశ్వర్, తోట సురేందర్, జక్కుల సమ్మయ్య, భూపెల్లి కనకయ్య, సీపెల్లి రాజలింగు, రాంసాని శేఖర్, ఎండీ ముస్తఫా, అల్లంల ప్రభాకర్, రాయమల్లు, సీపెల్లి సాగర్, మహిళా నాయకులు రమాదేవి, సుగుణ పాల్గొన్నారు.



పోస్టర్ అంటించి ప్రచారం చేస్తున్న చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, బీఆర్ఎస్ నాయకులు



బెజ్జూర్ మండల సమీపంలోని కల్వర్టు వద్ద వాల్ రైటింగ్ చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### బెజ్జూర్‌లో వాల్ రైటింగ్

బెజ్జూర్, ఏప్రిల్ 16 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బూస సారయ్య, యూత్ కన్వీనర్ దుర్గం తిరుపతి, నాయకులు షంషొద్దీన్, బాబు, మంజం కేశవ్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్టు

- అరికట్టేందుకు మహారాష్ట్ర సరిహద్దుల్లో నాలుగుచోట్ల చెక్‌పోస్టులు
- రైతులు లైసెన్సులున్న వారి వద్దే విత్తనాలు కొనాలి
- భూ భారతిపై అవగాహన కల్పిస్తాం
- రేషన్ సన్నబియ్యాన్ని విక్రయిస్తే క్రిమినల్ కేసులు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- పాల్గొన్న ఎస్పీ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జేసీ డేవిడ్

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : నకిలీ విత్తనాలు అమ్మేవారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జేసీ డేవిడ్(రెవెన్యూ)తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి జిల్లాలోకి రవాణా అవుతున్న నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి వచ్చే రహదారుల్లో హుడ్కిలి, వెంకట్రావ్‌పేట్, వాంకిడి, గూడెం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీ చేస్తున్నామన్నారు. ఇప్పటి సుమారు రూ. 12 లక్షల విలువైన నకిలీ విత్తనాలను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సమన్వయంతో చెక్‌పోస్టు వద్ద నిఘా పెడుతున్నామని, ఇంటెలిజెన్సీ ద్వారా కూడా సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. రైతులు కూడా నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్సులు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విడిగా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు ఎక్కడైనా ఉన్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఉన్న డీలర్స్‌కు అవగాహన కల్పించేందుకు త్వరలోనే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూభారతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. అన్ని రకాల భూ సమస్యలకు భూ భారతి ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం జిల్లాలో 90 శాతం విజయవంతం అయిందని, ప్రతి నెలా రేషన్ కార్డుల లబ్ధిదారులు సన్నబియ్యం తీసుకోవాలని సూచించారు. పేదలకు అందించే సన్నబియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఆయా మండలాల ఎంపీడీవోలు, కార్యదర్శుల ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, 22 నుంచి 30 వరకు గెజిటెడ్ అధికారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి లబ్ధిదారుల లిస్ట్ తయారు చేస్తామన్నారు. అదేవిధంగా జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే